క్లుప్తంగా

బూచేపల్లితో నిత్యానందరెడ్డి భేటీ



బూచేపల్లిని కలిసిన నిత్యానందరెడ్డి

దర్శి (కురిచేడు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కడప డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి భేటీ అయ్యారు. గురువారం సాయంత్రం ఆయన దర్శిలోని శివప్రసాదరెడ్డి నివాసానికి వచ్చి కలిశారు. రాబోయే ఎన్నికల్లో విజయం కోసం రాజకీయపరంగా ముందుకు సాగాల్సిన విధి విధానాలపై ఇరువురు చర్చించుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, భూపాల్‌రెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, డాక్టర్ల విభాగం కన్వీనర్ డాక్టర్ ఎస్ఎం బాషా, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యులు కపురం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

దేవాలయంలో చోరీ

కొమరోలు: ఓ దేవాలయంలో దొంగలు చోరీ చేశారు. ఈ సంఘటన మండల కేంద్రం కొమరోలులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద వెలసిన ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. దొంగలు దేవాలయం తలుపులకు వేసిన తాళాలు పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. గురువారం తెల్లవారు జామున పూజారి చోరీ జరిగినట్లుగా గుర్తించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై మల్లికార్జునరావు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రుణాల వసూళ్లపై దృష్టి పెట్టాలి

ముండ్లమూరు: సంఘాలు తీసుకున్న స్త్రీనిధి, ఉన్నతి రుణాల వసూళ్లపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని వైఎస్సార్ కేపీ ఏపీఎం హనుమంతరావు అన్నారు. స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో గురువారం వీఓఏలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సంఘాల నుంచి రావాల్సిన బకాయిలు ఈ నెలాఖరులోపు వసూలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి రోజు వారి నివేదికలు ఇవ్వాలన్నారు. సమావేశంలో సీసీలు మోహనరావు, గురవయ్య, అకౌంటెంట్ మార్తమ్మ, వీఓఏలు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం

దొనకొండ: వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలో నుంచి బయటకు తెస్తానని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం రైతుల ఆత్మహత్యలను రెట్టింపు చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విమర్శించారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కర్నా హనుమయ్య అధ్యక్షతన గ్రామీణ బంద్ సన్నాహక సమావేశం జరిగింది. ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్ కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, అంజిబాబు, సంతోష్ పాల్గొన్నారు.

డిగ్రీలో అడ్మిషన్లు ప్రారంభం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్లు కోరుతున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసాచార్యులు తెలిపారు. కళాశాలలో బీఎస్సీ హానర్స్, బీఎస్సీ హానర్స్ (బాటనీ), బీకాం హానర్స్ (కంప్యూటర్ అప్లికేషన్స్) బీఏ హానర్స్ (పొలిటికల్ సైన్స్) తదితర కోర్సులు ఉన్నట్లు పేర్కొన్నారు. చేరబోయే అభ్యర్థులు నెల రోజుల లోపు తమ దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని ఆయన కోరారు.

దారి సమస్య పరిష్కారం



శ్మశానంలో బోరు వేయిస్తున్న సర్పంచ్ రామకృష్ణ

కురిచేడు: మండలంలోని కల్లూరులో శ్మశానానికి వెళ్లే దారి లేక ఎన్నో ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులకు ర్పంచ్ నక్కా రామకృష్ణ తెరదించారు. తహసీల్దార్‌కు ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. సర్పంచ్ రామకృష్ణ చొరవతో ఆ దారిన ఉన్న పొలాల రైతులతో మాట్లాడి ఒప్పించి రహదారి ఏర్పాటు చేశారు. అంతేగాకుండా శ్మశానంలో బోరు కూడా వేయించటంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మాజీ డీసీ చైర్మన్ నక్కా ఎర్రబొల్లి కొండయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివస్వాములకు అన్నదానం



భక్తులకు అన్నవితరణ చేస్తున్న చైర్మన్ కృష్ణ

మార్కాపురం టౌన్: అన్నదానం మహాదానమని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ పేర్కొన్నారు. శివస్వాములకు స్థానిక శివాలయంలో అన్నవితరణ కార్యక్రమాన్ని గురువారం చైర్మన్ నిర్వహించారు. శివాలయంలో మార్కండేశ్వరస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలకు చేశారు. శివరాత్రి వరకూ శివస్వాములకు అన్నదానం చేస్తామని భక్తులు తెలిపారు.

అభిమానులతో కలిసి 'యాత్ర' చూసిన బూచేపల్లి

- నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఉచిత ప్రదర్శన



అభిమానులతో కలిసి ఆనందం వ్యక్తం చేస్తున్న బూచేపల్లి కుటుంబ సభ్యులు

దర్శి (కురిచేడు): యాత్ర సినిమా రిలీజ్ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి కుటుంబ సభ్యులు నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం యాత్ర మార్నింగ్‌షో చూశారు. తామొక్కరే కాకుండా నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి బూచేపల్లి కుటుంబ సభ్యులు సినిమా చూశారు. అందరితో కలిసి సినిమా చూడటం ఆనందంగా ఉందని వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డిలు పేర్కొన్నారు. నియోజకవర్గ కార్యకర్తలు, అభిమానుల కోసం రెండు సినిమా హాళ్లలో సినిమాను ఉచితంగా అందరు చూసేలా చర్యలు తీసుకున్నారు. నియోజవర్గంలోని అన్ని మండలాల నుండి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బూచేపల్లి నందిని, కె.రమణారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సోము దుర్గారెడ్డి, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, 1,5,7,8, వార్డు కౌన్సిలర్లు జగన్నాథం మోహన బాబు, బాబు, ఆవుల శివారెడ్డి, మేడగం మోహన రెడ్డి, కపురం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, ఎంపీటీసీల సంఘ అధ్యక్షుడు బండి గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, మాజీ సర్పంచ్ చంద్రగిరి గురవారెడ్డి, కొల్లా ఉదయభాస్కర్, రాచపూడి భాస్కర్, ఎన్వీ నాగిరెడ్డి, కురిచేడు జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, నారు శ్రీనివాసరెడ్డి, గోగులముడి లింగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి వీల్‌చైర్ అందజేత



దివ్యాంగునికి వీల్‌చైర్ అందజేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

దొనకొండ: మండలంలోని చందవరం పంచాయతీ పరిధి బట్టేపాడు గ్రామానికి చెందిన పరిమళ నరసయ్య అంగ వైకల్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. నాలుగు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి మన ఊరికి మన శివన్న అనే కార్యక్రమం చందవరంలో నిర్వహించారు. ఆ సమయంలో నరసయ్య వీల్‌చైర్ కావాలని కోరగా స్పందించిన ఆయన గురువారం అందజేశారు.

ఆర్థిక సాయం

చందవరం పంచాయతీలోని బట్టేపాడు ఎస్సీ కాలనీకి చెందిన గాలిముట్టి ప్రభుదాసు అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆర్థిక సాయం అందజేశారు. కాపా రమణారెడ్డి, మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, బత్తుల వెంకటసుబ్బయ్య యాదవ్ పాల్గొన్నారు.

గొంతు తడుపుతున్న బూచేపల్లి



ట్యాంకర్ల వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు

దర్శి (కురిచేడు): మండలంలోని లంకోజనపల్లి, వెంకటాపురం, గణేశ్వరపురం, కొత్త వెంకటాపురం గ్రామాలకు తాగునీరును ట్యాంకర్ల ద్వారా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు సరఫరా చేస్తున్నారు. ఎండలు మండుతుండటంతో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సమస్యను ఆయా గ్రామాల ప్రజలు బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డిల దృష్టికి తీసుకురావటంతో వెంటనే స్పందించిన వారు ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటి పంపిణీ ప్రారంభించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

నెడ్‌క్యాప్ డైరెక్టర్‌గా సానికొమ్ము



తిరుపతిరెడ్డికి ఉత్తర్వులు అందజేస్తున్న ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి (కురిచేడు): నెడ్ క్యాప్ బోర్డు డైరెక్టరుగా సానికొమ్ము తిరుపతిరెడ్డిని నియమిస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరి విజయానంద్ ఉత్తర్వులిచ్చారు. ఆ ఉత్తర్వులు వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. ఆ ఉత్తర్వులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతులమీదుగా గురువారం తిరుపతిరెడ్డికి అందజేశారు. తనకు అప్పగించిన నెడ్‌క్యాప్ డైరెక్టర్ పదవిని బాధ్యతగా నిర్వహించి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి, దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డికి మంచి పేరుతెస్తానని తిరుపతిరెడ్డి తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్య విభాగం కన్వీనర్ డాక్టర్ ఎస్ఎం బాషా, రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించండి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఏడీఎం కామేశ్వరి

మార్కాపురం: ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి సంస్థను ఆదరించాలని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు కోరారు. గురువారం మార్కాపురం బస్టాండ్‌లో మార్కాపురం, దోర్నాల, గుండంచర్ల, పుల్లలచెరువు, నాయుడుపాలెం, ఉమ్మడివరం రూట్లలోని బస్సుల్లో ఏర్పాటు చేసిన గిఫ్ట్ స్కీమ్ బాక్సుల్లో లక్కీ డ్రా ద్వారా ప్రయాణికులను ఎంపికచేసి బహుమతులు అందించారు. దోర్నాల రూట్‌లో ప్రయాణించిన రేష్మ, లిఖిత, గుండంచర్ల రూటులో కృష్ణారెడ్డి, పుల్లలచెరువు రూట్‌లో పద్మమ్మలకు లక్కీడ్రాలో బహుమతులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఏడీఎం కామేశ్వరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమకు ప్రభుత్వ ప్రోత్సాహం

- వైఎస్సార్ కేపీ పీడీ వసుంధరాదేవి రెడ్డి



మాట్లాడుతున్న పీడీ వసుంధరాదేవి రెడ్డి

త్రిపురాంతకం: పీఎం ఈజీబీ ద్వారా పాడి పరిశ్రమను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, డ్వాక్రా గ్రూపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ కేపీ పీడీ వసుంధరాదేవి రెడ్డి పేర్కొన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో గురువారం జరిగిన నియోజకవర్గ స్థాయి పొదుపు మహిళల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. స్త్రీ నిధి రుణాలు, రికవరి, ఎస్ఈఎస్‌పీ రుణాలు, రికవరీపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. నేషనల్ హైవేపై మొక్కలు సంరక్షణ అవసరమన్నారు. వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ శనివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉంటుందని వివరించారు. పాడిపరిశ్రమ లబ్ధిదారులతో ఆమె మాట్లాడారు. సమావేశంలో జిల్లా ఏజీఎం హర్షవర్ధన్, డీపీఎం డేవిడ్, పీఓపీ శ్రీనివాస ప్రసాద్, ఏరియా కో ఆర్డినేటర్ లక్ష్మీరెడ్డి, ఐదు మండలాల ఏపీఎంలు, సీసీలు, సిబ్బంది, వీఓఎస్‌లు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఈఆర్‌ఓ లోకేశ్వరరావు

దర్శి (కురిచేడు): ఎన్నికల నిర్వహణపై సెక్టార్ అధికారులు, స్టేషన్ హౌస్ అధికారులు, తహసీల్దార్లతో గురువారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో క్రిటికల్, హైపర్ క్రిటికల్ పోలింగ్‌స్టేషన్ల వివరాలను త్వరితగతిన అందించాలన్నారు. అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, తహసీల్దార్లకు ఫారం 6,7,8లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీసులు కలిసి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఏరియాలు గుర్తించి ఆయా పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక శ్రద్ధ వహించి పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ బూత్‌ల్లో మౌలిక సదుపాయలు పరిశీలించి ఏర్పాటు చేయాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఎటువంటి ప్రలోభాలకు తలొగ్గకుండా పనిచేయాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని దర్శి మండలంలో ఇంటర్మీడియేట్ స్ట్రాంగ్ రూమ్ ఏరియాను పరిశీలించారు. పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమస్యాత్మక ప్రాంతాల్లో బైండోవర్ కేసులు పెట్టాలని ఆదేశించారు. అన్ని శాఖల సమన్వ

రోడ్డు భద్రతపై ఆటోడ్రైవర్లకు అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రవికుమార్

దర్శి (కురిచేడు): రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం కురిచేడు రోడ్డులోని ఆటో స్టాండ్ వద్ద రోడ్డు భద్రత-మనందరి బాధ్యత కార్యక్రమాన్ని ఎంవీఐ రవికుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, ఓవర్ స్పీడు వెళ్లరాదని, రాంగు డైరెక్షన్‌లో వెళ్లకూడదని, అతివేగం ప్రమాదకరమని, సర్వీస్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు ఎక్కేటప్పుడు ఒక్క నిమిషం ఆగి అటు ఇటు చూసుకొని వెళ్లాలన్నారు. వాహనాలకు సంబంధించి ఆర్‌సీ, ఇన్సూరెన్సు, ఫిట్‌నెస్, పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్సు పాటించాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు



బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ రవికుమార్



బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ దాస్



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

పెద్దారవీడు తహసీల్దార్‌గా దాస్

పెద్దారవీడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతన తహసీల్దార్ కె.దాస్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డిని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. తహసీల్దార్ దాస్ పుల్లలచెరువు మండల నుంచి బదిలీపై వచ్చారు. అయన్ను డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ రాజేష్, వీఆర్వోలు, సిబ్బంది కలిసి శాలువాతో సత్కరించారు.

పెద్దదోర్నాల తహసీల్దార్‌గా హమీద్

పెద్దదోర్నాల: స్థానిక తహసీల్దార్‌గా ఎస్ఎం హమీద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా జరిగిన బదిలీల్లో ఆయన నెల్లూరు జిల్లా విడవలూరు మండలం నుంచి పెద్దదోర్నాలకు బదిలీపై వచ్చారు. ఇంత కాలంగా ఇక్కడ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన వేణుగోపాలరావు మార్కాపురం ఆర్‌డీఓ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. వేణుగోపాలరావు నుంచి బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ హమీద్‌కు ఇన్‌చార్జి డిప్యూటీ తహశీల్దార్ అంజిరెడ్డి, ఆర్ఐ నాగేశ్వరరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మార్కాపురం తహసీల్దార్‌గా రవికుమార్

మార్కాపురం రూరల్: మార్కాపురం మండల తహసీల్దార్‌గా కె.రవికుమార్ గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై మార్కాపురం వచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా సంప్రదించవచ్చని చెప్పారు. నూతన తహసీల్దార్‌కు రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌ఓలు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఇప్పటి వరకు మార్కాపురంలో పనిచేస్తున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి పల్నాడు జిల్లా మాచర్లకు బదిలీ అయ్యారు.

కంభం తహసీల్దార్‌గా రామయ్య

కంభం: స్థానిక తహసీల్దార్‌గా రామయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ శైలేంద్రనాథ్‌ను గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు. నెల్లూరు జిల్లా నుంచి రామయ్యను ప్రకాశం జిల్లాకు బదిలీ చేసి కంభం మండలానికి నియమించారు. ఈ నేపథ్యంలో ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు పూల మాలలు, శాలువాలు వేసి సత్కరించి అభినందనలు తెలిపారు. మండలంలో ప్రజాసమస్యల పరిష్కారనికి కృషి చేస్తానని నూతన తహసీల్దార్ స్పష్టం చేశారు.

తర్లుపాడులో విద్యుత్ అదాలత్



వినియోగదారులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

తర్లుపాడు: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు మండల కేంద్రం తర్లుపాడులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ హనుమానాయక్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నుంచి 29 మంది ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఈఈ నాగేశ్వరరావు, డీఈఈ షియానాయక్, ఏఏఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. వినియోగదారుల అర్జీలను తక్షణమే పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

మద్యం అక్రమంగా కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు

కంభం: మండలంలోని జంగంగుంట్లలో గురువారం రెడ్డిబోయిన నాగరాజు అనే వ్యక్తి వద్ద అక్రమంగా ఉన్న 17 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ బాలకృష్ణ తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అక్రమంగ మద్యం విక్రయాలు చేసినా, మద్యం నిల్వలు ఉన్నా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సీఐతో పాటు ఎస్సై వి.ఆర్ సత్యనారాయణ, సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

జోరుగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న అధికారులు

తర్లుపాడు: ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మండలంలోని పలు సచివాలయాల పరిధిలో వేగంగా సాగుతోంది. నవరత్నాల్లో భాగంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు పలుచోట్ల రూ.లక్షల విలువైన భూములు కొనుగోలు చేసి ఇళ్ల పట్టాలు అందించింది. వాటిని లబ్ధిదారుల పేరున సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. సెలవు దినాల్లో సైతం వీఆర్వోలు పంచాయతీ సెక్రటరీలు డిజిటల్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండి లబ్ధిదారులకు వేగంగా రిజిస్ట్రేషన్లు పూర్తిచేస్తున్నారు. మండలంలోని తుమ్మలచెరువులో ఇన్‌చార్జి ఈఓఆర్డీ బాలకృష్ణ, వీఆర్వో కిశోర్, డీఏ పీరా, సర్వే అసిస్టెంట్ హేమంత్ లబ్ధిదారులకు హక్కుపత్రాలు అందించారు.

రేషన్ బియ్యం పట్టివేత



ట్రాలీ ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం వద్ద అధికారులు

పెద్దారవీడు: మండలం పరిధి దేవరాజుగట్టు సమీపంలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న ట్రాలీ ఆటో వాహనాన్ని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా గురువారం సాయంత్రం పట్టుకున్నారు. సుంకేసుల నుంచి త్రిపురాంతకం పట్టణానికి తీసుకెళ్తున్న ట్రాలీ ఆటోను తనిఖీ చేశారు. అందులో ప్లాస్టిక్ రంగుల సంచుల్లో రేషన్ బియ్యంగా గుర్తించారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం మేరకు 27 క్వింటాళ్ల రేషన్ బియ్యం, ట్రాలీ ఆటోను సీజ్ చేశామని అధికారులు తెలిపారు. పెద్దారవీడు పోలీసుస్టేషన్‌కు ట్రాలీ ఆటోను తరలించి రేషన్ బియ్యం వ్యాపారులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. సివిల్ సప్లయిస్ ఈడీటీ తిరుపతిరెడ్డి, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాఘవరావు, ఎస్ఐలు నాగేశ్వరరావు, కె.వెంగళరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

తర్లుపాడు: మండలంలోని లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 అచ్యుత సుబ్బారావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్క్‌బుక్స్, లెసన్స్ ప్లాన్, పిల్లల నోట్‌బుక్స్, హాజరు పట్టిక, టీచర్స్ డైరీని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం చేసి విద్యార్థులతో కొద్దిసేపు సరదాగా గడిపారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని హెచ్ఎం మౌలాలిని కోరారు.

మిరప సాగుపై అవగాహన

మార్కాపురం రూరల్: పట్టణంలోని ఎస్సీబీసీ కాలనీ లోగల డ్వాక్రా బజారులో డివిజన్‌లోని ఆర్‌బీకే సిబ్బందికి మిరప సాగుపై జిల్లా ఉద్యాన అధికారి వైఎంఎస్ గోపీచంద్ అవగాహన కల్పించారు. ఈ-మిర్చ్ ప్రాజెక్టులో భాగంగా టెక్నాలజీ సహాయంతో మిరప పంటలో నాణ్యతా ప్రమాణాలు, దిగుబడి పెంచడం ఎలా అనే అంశాలను వివరించారు. డిజిటల్ గ్రీన్ సంస్థ కోఆర్డినేటర్ కమలాకర్, ఏపీఎంఐపీ పీడీ రమణారావు, మార్కాపురం ఏడీఏ రమాదేవి, మార్కాపురం, గిద్దలూరు హెచ్‌ఓలు రమేష్‌బాబు, విష్ణుప్రియ, హెచ్ఈఓ సీహెచ్ శేషగిరి, మార్కాపురం, పెద్దారవీడు ఏఓలు దేవిరెడ్డి శ్రీనివాసులు, బుజ్జిబాయి, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు నూరు శాతం పూర్తి చేయాలి

మార్కాపురం రూరల్: జగనన్న కాలనీలోని గృహ నిర్మాణాలను నూరు శాతం పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ పవన్‌కుమార్ తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులతోపాటు ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని కార్యదర్శులకు సూచించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఒక్కో ఇంటికి ప్రభుత్వం 1.80 లక్షల రూపాయలను అందజేస్తోందని, సబ్సిడీపై ఇనుము, ఇసుక, సిమెంటు అందిస్తోందని, లబ్ధిదారులు డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులైతే బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని వీటిపై అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ తోట చందన, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బ్రాహ్మణ సత్రం అభివృద్ధికి పాటుపడాలి

కొనకనమిట్ల: వెలుగొండ పుణ్యక్షేత్రంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర బ్రాహ్మణ అన్నదాన సత్రాన్ని అభివృద్ధి చేయడానికి సభ్యులు కృషి చేయాలని బ్రాహ్మణ అన్నదాన సత్రం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కూనపులి శ్రీకాంత్‌శర్మ, చక్కిలం మురళీకృష్ణ కోరారు. గురువారం సత్రంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో వారు సత్రం అభివృద్ధిపై చర్చించారు. మార్చిలో వెలుగొండ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సత్రంలో అన్నదానం నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సహకారం అందించాలనికోరారు.సత్రంలో గదులు, ప్రహరీ నిర్మాణానికివిరాళాలుఅందించేందుకు పాటుపడాలని కోరారు. సమావేశంలో సత్రం సభ్యులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

గిద్దలూరు రూరల్: గూడ్స్ రైలు కింద పడి ఓ వృద్ధురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గిద్దలూరు మండలంలోని దిగువమెట్ట గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. అందిన సమాచారం ప్రకారం.. దిగువమెట్ట గ్రామానికి చెందిన పోలమ్మ అనే వృద్ధురాలు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. నంద్యాల నుంచి గుంటూరు వైపు వెళ్తున్న గూడ్స్ రైలు కింద పడబోయింది. ఆమెను గమనించిన గూడ్స్ రైలు లోకోపైలట్ సడన్ బ్రేకులు వేసి నిలిపివేశాడు. కానీ అప్పటికే రైలు బండి తగలడంతో ఆమె కుడిచెయ్యి విరిగిపోయింది.తీవ్రగాయాలపాలైన పోలమ్మను చికిత్స నిమిత్తం 108 సిబ్బంది పట్టణంలోని ఏరియా వైద్యశాలకుతరలించారు.సమాచారం అందుకున్ననంద్యాలజీఆర్‌పీఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అపరాల సాగులో యాజమాన్య పద్ధతులు

తాళ్లూరు (ముండ్లమూరు): రైతులు అపరాల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం మండలంలోని లక్కవరంలో కంది పంటను ఆయన పరిశీలించారు. రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. జాతీయ ఆహార భద్రత మిషన్ కార్యక్రమంలో భాగంగా కంది సాగును ప్రోత్సహిస్తూ సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌లో లక్కవరంలో 20 మంది రైతులు 20 ఎకరాల్లో సాగు చేయగా వారిని ప్రోత్సహించామన్నారు. వారికి ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చాయన్నారు. వారికి సాంకేతిక పరమైన సూక్ష్మ మెళకువలు తెలియజేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కందిలో పూతగూడు పురుగు, మారుకా మచ్చల పురుగు కాలయ తొలుచు పురుగు ఆశించిందన్నారు. వాటి నివారణా చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట వీఏఏ వీరాంజనేయులు, రైతులు ఉన్నారు.